సాక్షి
ప్రకాశం

శనివారం । 24 । ఫిబ్రవరి । 2024



కూలీల ఆటోను ఢీకొట్టిన లారీ

కూలీలతో వెళ్తూ రోడ్డు పక్కన ఆగిన ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఆరుగురికి తీవ్ర, మరో 12 మందికి స్వల్ప గాయాలయ్యాయి. - 8లో..



పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

గ్రూప్‌–2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జేసీ ఆర్‌.గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33/25

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.



సీఎం బహిరంగ సభకు హాజరైన జన సందోహంలో ఒక భాగం



పేదల చేతుల్లో లక్షల ఆస్తి

- ఒంగోలుకు పండగొచ్చింది..
- పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన సీఎం జగన్‌
- తాగునీటి పథకానికి శిలాఫలకం ఆవిష్కరణ
- జై జగన్‌..జై వాసన్నా నినాదాలతో దద్దరిల్లిన ప్రాంగణం

ఒంగోలు నగరవాసుల సుదీర్ఘ కల నెరవేరింది. అద్దె ఇళ్లలో అవస్థలు పడుతున్న నిరుపేదల చేతుల్లో సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రూ. లక్షల విలువజేసే అస్తిని ఇచ్చారు. పట్టాలు పంపిణీ చేస్తున్న శుభ సమయాన వేలాదిగా తరలివచ్చిన ప్రజల కళ్లల్లో కోటి కాంతులు వెదజల్లాయి. ఇళ్ల పట్టాలే కాదు..మౌలిక వసతుల కల్పనతో పాటు..ఇళ్లు నిర్మించి ఇస్తామంటూ సీఎం జగన్‌, మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన ప్రకటనలతో ఇళ్లు లేని నిరుపేదల్లో ఆనందాలకు అవధుల్లేకుండా పోయింది. జై జగన్‌..జై వాసన్నా అంటూ చేసిన నినాదాలతో సభా ప్రాంగణం దద్దరిల్లిపోయింది. జగన్‌కు అండగా ఉండేందుకు మేము సైతం సిద్ధం అంటూ హోరెత్తించారు..

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా నగరంలో 21 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ, నగర వాసుల తాగునీటి సమస్య పరిష్కారానికి సంబంధించిన ప్రాజెక్టు ప్రారంభానికి వచ్చిన సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. నగర నలుమూలల నుంచి ఇళ్ల లబ్ధిదారులతో పాటు నగర వాసులు, వైఎస్సార్‌ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. దారులన్నీ అగ్రహారం వైపే అన్న విధంగా వాహనాలు, జనం కదిలారు. ఉదయం 8 గంటల నుంచే జనం రాకతో సభా ప్రాంగణం కళకళలాడింది. ఇళ్ల పట్టాల లబ్ధిదారులు, వారి కుటుంబసభ్యులు తరలిరావడంతో పండగ వాతావరణం నెలకొంది.

సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 10.50 నిమిషాలకు అగ్రహారం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి ఆయన నూతన లే అవుట్‌ పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఒంగోలు నగర ప్రజలకు శాశ్వత మంచినీటి పరిష్కారానికి ఏర్పాటు చేసిన రూ.339 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టనున్న పథకానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిరుపేద లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్టర్డ్‌ డీడ్‌ డాక్యుమెంట్ల తయారీ విధానాన్ని అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్లో అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేదికపై ఏర్పాటు చేసిన వైఎస్సార్‌ విగ్రహం వద్ద పూలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేదికపై ఉన్న ప్రజాప్రతినిధులను, నాయకులను, అధికారులను ఆయన పలకరించారు.



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, పక్కన బాలినేని, ఆదిమూలపు, బూచేపల్లి వెంకాయమ్మ, గంగాడ సుజాత తదితరులు

తొలుత కలెక్టర్‌ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని వివరించారు. అనంతరం బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రసంగించారు. ఆయన ప్రసంగిస్తున్నంత సేపూ సభలో జై వాసన్నా అంటూ నినాదాలు చేశారు. పేదల ఇళ్ల పట్టాల పంపిణీ విషయంలో తెలుగుదేశం పార్టీ కుట్రలను ఆయన వివరిస్తున్నప్పుడు జనం నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. ఇద్దరు ఇళ్ల పట్టాల లబ్ధిదారులు ప్రసంగించారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో తమ కుటుంబానికి జరిగిన మేలును వివరించారు. తాము జగనన్న వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నామంటూ అనడంతో మేము కూడా అంటూ సభకు వచ్చిన జనం నినదించారు. చివరగా సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు 50 నిమిషాలు పాటు ప్రసంగించారు. 'నేను పైన దేవుడ్ని.. మిమ్మల్ని నమ్ముకున్నాను..' అంటూ సీఎం అన్నప్పుడు, ఇళ్ల పట్టాల విషయంలో తెలుగుదేశం పార్టీ, చంద్రబాబు చేసిన కుట్రలను వివరిస్తున్నపుడు జనం నుంచి మంచి స్పందన వచ్చింది. ప్రసంగం ముగిసిన తర్వాత సీఎంతో ఒంగోలు నగరపాలక సంస్థ కార్పొరేటర్లు ఫొటోలు దిగారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన నాయకులను ఆయన పలకరించారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆయన తాడేపల్లి పయనమయ్యారు. సభా ప్రాంగణం చుట్టూ ఏర్పాటు చేసిన కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

భారీ బందోబస్తు..

సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సభకు పోలీస్‌ అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి పర్యవేక్షణలో ఎలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. సీఎం పర్యటన ప్రశాంతంగా ముగియడంతో ఊపిరిపీల్చుకున్నారు.



సీఎం జగన్‌తో బాలినేని, చెవిరెడ్డి



యువత కేరింత



పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న మఠంపల్లి దక్షిణామూర్తి



సీఎం జగన్‌తో బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

బతుకు భయం వీడింది..

ఒంగోలు: బతుకు భయం వీడింది...నిశ్చింతగా జీవించగలమనే నమ్మకం కుదిరింది. జీవితంలో సొంతింటి కల నెరవేరుతుందా అని నిత్యం మదన పడేవాళ్లం. కానీ మా కల నెరవేరింది. రిజిస్ట్రేషన్‌ చేసి మరీ పట్టా చేతికిస్తున్నారు. టీవీల్లో అక్కడ ఇళ్లు కాదు...ఊళ్లు నిర్మించారని చూశాం. కానీ నేడు మాకు కూడా అదే అదృష్టం కలగబోతోంది. ఇప్పుడు మాకు ఒకరు కాదు...ఇద్దరు అన్నలు. జగనన్న, వాసన్న. ఇంతకంటే మా తలరాతలు మార్చే నాయకుడ్ని చూస్తామని మేం భావించడం అత్యాశే అవుతుంది.

ఇవి ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన లబ్ధిదారుల మనోగతాలు

18 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం



నేను ప్రైవేట్‌ ఆస్పత్రిలో కూలి పనికి వెళుతుంటా. నా భర్త వెల్డింగ్‌ పనిచేస్తుంటారు. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. 18 ఏళ్లుగా సొంతింటి గురించి కలలు కనడమే తెలుసు. నేడు సాకారం అవుతున్నందుకు సంతోషంగా ఉంది. మాలాంటి వారికి ఇంటి స్థలం మంజూరు చేసేందుకు వాసన్న చేసిన పోరాటం మేం ఎప్పటికీ మరిచిపోలేం.

– షేక్‌ జాను

సొంతింటిని కట్టుకుంటాం



నేను టైలర్‌గా జీవనం సాగిస్తున్నా. నా భర్త కార్పెంటర్‌. నాకు జనగన్న చేదోడు పథకం ద్వారా ఆర్థికసాయం అందుతుంది. నా ఇద్దరు పిల్లలో ఒకరికి అమ్మఒడి నగదు అందుతున్నాయి. సొంతింటి కోసం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో దరఖాస్తు చేశాం. సచివాలయంలో రిజిస్ట్రేషన్‌ చేసి మరీ స్థల పట్టా ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం చేస్తున్నట్లు జగనన్న ప్రకటించారు. త్వరలోనే మా సొంతింటిని కట్టుకుంటాం.

– మౌనిక, శివప్రసాద్‌ కాలనీ

గత ప్రభుత్వంలో రేషన్‌కార్డు కూడా మంజూరు కాలేదు



ప్రైవేట్‌ ఆస్పత్రిలో చిరుద్యోగిగా పనిచేసే నేను గత ప్రభుత్వంలో రేషన్‌కార్డు కోసం ఎన్ని సార్లు తిరిగినా మంజూరు కాలేదు. రేషన్‌కార్డు లేకుంటే ఏ పథకానికి అర్హులం కాదు. దీంతో నా తొలి ఓటును ఫ్యాను గుర్తుపై వేశా. వైఎస్సార్‌ సీపీ అధికారంలోకి రాగానే రేషన్‌ కార్డు వచ్చింది. ఇప్పుడు ఇంటి పట్టా వచ్చింది. అది కూడా పూర్తి హక్కులతో. అందుకే ఈ దఫా కూడా ఫ్యాను గుర్తుపైనే ఓటు వేస్తాం...మా వాసన్న ఆధ్వర్యంలోనే గృహ ప్రవేశాన్ని చేసుకుంటాం.

– ప్రసన్న జ్యోతి

మా లాంటి వారిని దేవునిలా ఆదుకుంటున్నాడు



ఏళ్ల తరబడి అద్దె ఇంట్లోనే జీవనం. దివంగత వైఎస్‌ రాజశేఖరరెడ్డి హయాంలో మాకు పట్టా వచ్చింది. కానీ మళ్లీ ఎందుకో రద్దు చేశారు. కోర్టుల్లో ఉందన్నారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్‌ చేసి మరీ పట్టా ఇవ్వడం ఆనందంగా ఉంది. ఈ వయసులో నాకు సొంతిళ్లు మంజూరైందంటే నమ్మలేకుంటా ఉన్నా. ఎక్కడో మారుమూలలో కాకుండా వేలాది ఇళ్ల మధ్యలో నేను నివాసం ఉండనున్నాననే భావన నాకు ఆనందం కలిగిస్తుంది.

– ఈర్లంక రమాదేవి

ఐదేళ్లుగా అద్దె ఇంట్లోనే..



ఐదేళ్లుగా అద్దె ఇంట్లోనే ఉంటున్నా. నాకు ఇంటి స్థలం మంజూరవుతుందని కలలో కూడా అనుకోలేదు. కానీ నేడు రూ.6 లక్షల విలువైన ఇంటి పట్టా రిజిస్ట్రేషన్‌ చేసి పట్టా ఇవ్వడంతో పాటు అన్ని వసతులతో ఇల్లు కట్టిచ్చి ఇస్తామనడం నేను జీవితంలో మరిచిపోలేను.

– సైదాబీ

అన్ని రకాలుగా అండగా..



గత పదేళ్లుగా సొంత ఇంటి కోసం ఆలోచించని రోజు లేదు. టీడీపీ హయాంలో దరఖాస్తు చేసుకున్నా ఇస్తామని మభ్యపెట్టారు. కానీ పట్టాను రిజిస్ట్రేషన్‌ చేసి మరీ చేతికిచ్చారు. జగనన్న, వాసన్న మనసున్న మారాజులు. వారు చల్లగా ఉంటేనే మాలాంటి వాళ్లం సంతోషంగా ఉండగలం.

– సైఫీ మొహమ్మద్‌ షమీనా

నా కల నెరవెరతోంది:



నా పెద్ద కూతురు, అల్లుడు నాతోనే ఉంటారు. ఇళ్లలో పాచిపని చేసుకొని జీవనం సాగించే నాకు సొంతిల్లు ఓ కల. ఇప్పుడు ఆ కల నెరవెరుతోంది. పట్టా ఇచ్చారు. ఇల్లు కూడా కట్టించి ఇచ్చే సరికి నా ఇంటి ఖరీదు రూ.10 లక్షలు దాటుతుందంటున్నారు. ఈ ఊహే నాకు ఎనలేని ఆనందాన్ని కలగిస్తుంది. మా లాంటి వారికి జగనన్న దేవుడు.

– దారా గ్రేసమ్మ, కబాడీపాలెం

మాట ఇచ్చా.. నిలబెట్టుకున్నా..



వేదికపై సీఎం జగన్‌, బాలినేని, చెవిరెడ్డి, మంత్రులు ధర్మాన, మేరుగ, ఆదిమూలపు, ఎంపీ నందిగం, ఎమ్మెల్యేలు కరణం, అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, టీజేఆర్‌, బూచేపల్లి వెంకాయమ్మ, పోతుల సునీత

- జగనన్న భరోసా ఇచ్చాడు కాబట్టే సాధ్యమైంది
- సీఎం బహిరంగ సభలో బాలినేని ఉద్వేగభరిత ప్రసంగం
- మెగా టౌన్‌షిప్‌లో మౌలిక వసతుల కోసం రూ. 240 కోట్లు
- ఇళ్ల నిర్మాణాలకు రూ. 1100 కోట్లు
- ఒంగోలు నగర శాశ్వత తాగునీటి పరిష్కార ప్రాజెక్టుకు సీఎం శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: 'మాట ఇచ్చాను.. నిలబెట్టుకున్నాను.. పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చాకే పోటీ చేస్తానని చెప్పాను. ఎన్ని ఇబ్బందులు ఉన్నా..రైతుల నుంచి భూమి కొనుగోలుకు నిధులిస్తానని సీఎం వైఎస్‌ జగన్‌ భరోసా ఇచ్చారు. చెప్పినట్టుగానే రూ.231 కోట్లు మంజూరు చేశార'ని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలు నగర శివారులోని ఎన్‌.అగ్రహారం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న లేఔట్‌లో పేదలకు ఇళ్ల పట్టాలు, రిజిస్టర్డ్‌ కన్వేయన్స్‌ డీడ్లను సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో బాలినేని మాట్లాడారు. పూర్తి ప్రసంగం ఆయన మాటల్లోనే.. 'మూడేళ్ల క్రితం ఇచ్చిన మాట ప్రకారం మన జగనన్న ఈ రోజు పేదలందరికీ పట్టాలు ఇచ్చేందుకు ఒంగోలు వచ్చినందుకు ప్రజలందరి తరఫున ధన్యవాదాలు. ఒంగోలు నగరంలోని పేదలకు యరజర్ల వద్ద దాదాపు 800 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని నిర్ణయిస్తే తెలుగుదేశం పార్టీ నాయకులు అది మైనింగ్‌ ల్యాండ్‌ అని హైకోర్టులో కేసు వేసి అడ్డు తగిలారు. గతంలో అదే టీడీపీ పార్టీ నాయకులు యరజర్ల వద్ద మైనింగ్‌కు వీల్లేదని కోర్టుకు వెళ్లారు. అందుకు టీడీపీ నేతలు సిగ్గుపడాలని ఈ సభాముఖంగా తెలియజేస్తున్నాం. పేదలు ఇళ్లు కట్టుకోవడానికి భూమి ఇస్తున్నా టీడీపీ వాళ్లకు ఏడుపేనన్నారు. 2008లో వైఎస్‌ రాజశేఖరరెడ్డి హయాంలో పేదలకు పట్టాలు ఇస్తే అవి పేదలకు కాదని టీడీపీ నేతలు అన్నారు. ఒంగోలులో సుమారు 25 వేల మంది పేదలకు స్థలాలిచ్చేందుకు రైతుల నుంచి భూమి సేకరిస్తే దానిపైనా నీచంగా ఆరోపణలు చేస్తున్నారు. ఇదే సభలో రైతులు కూడా ఉన్నారు. ఒక్క రైతు నుంచి అయినా రూపాయి తీసుకున్నట్లు నిరూపిస్తే నాకున్న కొద్ది మొత్తం ఆస్తి రాసిస్తా. ఒకటి చెబుతున్నా. ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో ఒక్క పొరపాటు చేయలేదు. రాజశేఖరరెడ్డిగారు నాకు చెప్పిన మాట ఒక్కటే.. ఎదిగేకొద్ది ఒదిగి ఉండాలని ఆయన చెప్పారు. నేను ఒదిగి ఉన్నాను కాబట్టే నాపై ప్రజలు ప్రేమ చూపిస్తున్నారు. ఒంగోలు నగరంలో జగనన్న కాలనీ లేఔట్‌లో స్థలాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన తదితర పనులకు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి దాదాపు రూ.1300 కోట్లు మంజూరు చేశారు. అందులో రూ.240 కోట్లు నూతన లేఔట్‌లో మంచినీటి పథకానికి కేటాయించారు. అంతేకాదు గతంలో ఒంగోలు పర్యటనకు హాజరైన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌.. నగరంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.339 కోట్లు మంజూరు చేస్తామని మాట ఇచ్చి నెరవేర్చారు. నిధులు మంజూరు చేయడమే కాకుండా శంకుస్థాపన చేశారు. ఒంగోలు పట్టణానికి రోజూ మంచినీరు అందించేలా చర్యలు చేపడుతున్నాం. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌ సీపీ జెండా ఎగరేసి సీఎం వైఎస్‌ జగన్‌కు కానుకగా ఇద్దాం' అని బాలినేని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న బాలినేని

తొలుత కలెక్టర్‌ ఏఎస్‌ దినేష్‌ కుమార్‌ మాట్లాడుతూ.. నవరత్నాలు పేదలందరికి ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఒంగోలులో 20,840 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలోనే భారీ లేఔట్లకు రూ.231 కోట్లు మంజూరు చేసి, పట్టాల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రజాప్రతినిధులకు స్వాగతం పలుకుతున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఒంగోలు పార్లమెంట్‌ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌ తలశిల రఘురామ్‌, జెడ్పీ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ, బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌, ఒంగోలు నగర మేయర్‌ గంగాడ సుజాత, ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ ఆదిశేషగిరి రావు, లిడ్‌క్యాప్‌ చైర్మన్‌ కాకుమాను రాజశేఖర్‌, ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ.నాగార్జునరెడ్డి, బుర్రా మధుసూదన్‌ యాదవ్‌, టీజేఆర్‌ సుధాకర బాబు, కరణం బలరామ కృష్ణమూర్తి, ఎమ్మెల్సీలు తూమాటి మాధవ రావు, పోతుల సునీత, పర్వత రెడ్డి చంద్రశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి, డిప్యూటీ మేయర్లు వెలనాటి మాధవ రావు, వేమూరి సూర్యనారాయణ, స్థానిక నాయకులు కఠారి శంకర్‌, మైనారిటీ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ ఎస్‌డీ బాష, జలీల్‌, గోలి తిరుపతి రావు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు స్వాగతం పలుకుతున్న చెవిరెడ్డి, బాలినేని, ప్రణీత్‌రెడ్డి దంపతులు



సీఎం జగన్‌కు నంది జ్ఞాపిక అందజేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రణీత్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, గంగాడ సుజాత తదితరులు



మీరు నిజం మీ మాట నిజం ప్లకార్డులతో మహిళల ఉత్సాహం


సీఎం వైఎస్ జగన్‌తో మంత్రి మేరుగు నాగార్జున


మంత్రి ఆదిమూలపు సురేష్


ఎంపీ నందిగం సురేష్


ఎమ్మెల్సీ పోతుల సునీత


జంకె వెంకటరెడ్డి


ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్


ఎమ్మెల్యే అన్నా రాంబాబు


ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



వైపాలెం, కనిగిరి ఇన్‌చార్జిలు తాటిపర్తి చంద్రశేఖర్, దద్దాల నారాయణయాదవ్


జూపూడి ప్రభాకర్


మేయర్ గంగాడ సుజాత


వైఎం ప్రసాద్‌రెడ్డి


కుప్పం ప్రసాద్


చింతలచెరువు సత్యనారాయణరెడ్డి


డాక్టర్ అశోక్‌కుమార్ రెడ్డి


కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్


ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి


కాకుమాను రాజశేఖర్


శిద్దా సుధీర్‌కుమార్


కంది రవిశంకర్


మన్నెమాల సుకుమార్‌రెడ్డి

సంక్షేమ సారథికి
సాదర స్వాగతం

ఒంగోలు నగరంలో శుక్రవారం ఇళ్ల పట్టాల పంపిణీకి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర మంత్రులు, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. జిల్లా ఉన్నతాధికారులు సీఎంకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సభా వేదిక ఏర్పాటు చేసిన ఎన్.అగ్రహారం లేఔట్ వద్ద లబ్ధిదారులైన మహిళలు అమితానందంతో కనిపించారు.

\- సాక్షి, ఒంగోలు




ఇళ్ల పట్టాల పంపిణీ సందర్భంగా సభా వేదిక వెలుపల అక్కచెల్లెమ్మల ఆనందం


రిజిస్టర్డ్ కన్వేయన్స్ డీడ్ గురించి సీఎం వైఎస్ జగన్‌కు వివరిస్తున్న అధికారులు


ఇంటి పట్టా అందుకుని సీఎంతో సంతోషాన్ని పంచుకుంటున్న మహిళ


సీఎం వైఎస్ జగన్‌కు లేఔట్ల గురించి వివరిస్తున్న పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీలక్ష్మీ, పక్కన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్



ఒంగోలు నగర శివారులోని ఎన్.అగ్రహారం సమీపంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి తరలివస్తున్న మహిళలు

గ్రూప్-2 పరీక్షలు
పకడ్బందీగా నిర్వహించాలి


సమావేశం నిర్వహిస్తున్న జేసీ గోపాలకృష్ణ

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: గ్రూప్–2 పరీక్షలను ఈ నెల 25వ తేదీ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై రూట్ ఆఫీసర్లు, లైజన్ ఆఫీసర్లతో స్థానిక స్పందన భవనంలో శుక్రవారం సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రూట్ అధికారులు పరీక్ష ముందే రోజే రూట్లను తనిఖీ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో మొత్తం 49 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 10.30 గంటల నుంచి 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. 49 కేంద్రాలకు 15 రూట్లుగా విభజించి 15 మంది జిల్లా అధికారులను రూట్ ఆఫీసర్లుగా నియమించినట్లు తెలిపారు. వారితో పాటు లైజన్ అధికారులుగా తహసీల్దార్లను నియమించినట్లు తెలిపారు. పరీక్ష పత్రాలు తీసుకున్న దగ్గర నుంచి పరీక్ష అనంతరం జవాబు పత్రాలు సబ్మిట్ చేసేంత వరకు చీఫ్ సూపరింటెండెంట్లు బాధ్యత తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమేరాలు, సీటింగ్ ఏర్పాట్లు, తాగునీరు, మహిళలు, పురుషులకు వేర్వేరుగా టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలు రాసే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అభ్యర్థుల నంబర్లు, గదులు తెలిసేలా డిస్‌ప్లే చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. వికలాంగులు, గర్భిణులకు వీలైనంత వరకు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ రాజగోపాల్, ఇతర సిబ్బంది, పలు కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయండి

- సీఈఓ ముఖేష్‌కుమార్ మీనా

ఒంగోలు అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్‌కుమార్‌మీనా ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశం జిల్లాలో 15,691 క్లెయిమ్‌లు ఉన్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ సీఈఓకు తెలిపారు. నాలుగు రోజుల్లో వాటిని పూర్తి చేయాలని సీఈఓ సూచించారు. మొత్తం ఓట్లలో తొలగించాల్సిన ఓట్లు 0.1 శాతం కంటే ఎక్కువ ఉంటే అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. సెక్టార్ అధికారులు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను మ్యాపింగ్ చేయాలన్నారు. వీడియో సమావేశంలో డీఆర్‌ఓ శ్రీలత, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేఏఎంపీ టెస్ట్‌లో నవోదయ విద్యార్థి సత్తా



తర్లుపాడు: కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఇటీవల నిర్వహించిన నాలెడ్జ్ అవేర్‌నెస్ మ్యాపింగ్ ఫ్లాట్‌ఫాం(కేఏఎంపీ) టెస్టులో కలుజువ్వలపాడులోని జవహర్‌నవోదయ విద్యాలయ–2 పదో తరగతి విద్యార్థి గొడవర్తి హర్షిత్ విశ్వేశ్వర్ సత్తా చాటాడు. రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థిని ప్రిన్సిపాల్ జీఈజీ ప్రసన్నకుమార్, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు కృషి, ప్రిన్సిపాల్ ప్రోత్సాహంతోనే తాను ఈ ఘనత సాధించినట్లు విశ్వేశ్వర్ పేర్కొన్నాడు.

క్లుప్తంగా

27న జాబ్ ఫెస్ట్

ఒంగోలు: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో జవహర్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ జాబ్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ కమిషనరేట్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని ఉలవపాడు, కందుకూరు, కనిగిరి, కంభం, వై.పాలెం, దర్శి, దోర్నాల, అద్దంకి ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులంతా జాబ్‌మేళాకు అర్హులేనన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఎయిడెడ్, ప్రైవేటు కాలేజీల్లో చదువుతున్న, చదువు పూర్తయిన విద్యార్థులు కూడా అర్హులేనన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులు పాస్/ఫెయిల్ అయిన వారు జాబ్‌మేళాలో పాల్గొనేటప్పుడు వారి సర్టిఫికెట్లు జెరాక్స్ కాపీలు మూడు సెట్లు తీసుకురావాలన్నారు. జాబ్ ఫెస్ట్‌లో 16 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, ఉదయం 9 గంటలకల్లా జాబ్‌ఫెస్ట్‌కు హాజరై సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కళ్యాణి సూచించారు.

విద్యుత్ షాక్‌కు గురై కార్మికుడు మృతి

కంభం: విద్యుత్ షాక్‌కు గురై కార్మికుడు మృతి చెందిన సంఘటన కంభం మండలంలోని యర్రబాలెం గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. గ్రామంలో కొత్త స్తంభాలు వేసి విద్యుత్ లైన్లు లాగుతున్న సమయంలో విద్యుత్ స్తంభంపైన ఉన్న వెంకటేశ్వర్లు (35) విద్యుత్ షాక్‌కు గురవగా, వెంటనే అతన్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.


సీఎం వైఎస్ జగన్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఈశ్వరాచారి

సీఎంకు జ్ఞాపిక బహూకరించిన దారుశిల్పి ఈశ్వరాచారి

ఒంగోలు: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల స్థల పట్టాల పంపిణీ కార్యక్రమానికి శుక్రవారం ఒంగోలు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నవరత్నాలతో కూడిన వైఎస్ జగన్ మెమోంటోను దారుశిల్పి ఆదిమూలం ఈశ్వరాచారి అందించారు. ఆయన వెంట రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట రజని బ్రహ్మేంద్రకుమార్, తదితరులు ఉన్నారు.

కూలీల ఆటోను ఢీకొట్టిన లారీ

- ఆరుగురికి తీవ్ర, 12 మందికి స్వల్ప గాయాలు
- చింతల నుంచి పెద్దబొమ్మలాపురం వెళ్తుండగా శ్రీశైలం ఘాట్‌లో ఘటన
- క్షతగాత్రుల రోదనలతో హోరెత్తిన దోర్నాల వైద్యశాల


తీవ్రంగా గాయపడిన మహిళకు చికిత్స చేస్తున్న డాక్టర్


మహిళ గాయాలకు కుట్లు వేస్తున్న డాక్టర్ సంజీవ్


సంఘటనా స్థలంలో చెంచు గిరిజనులు


ప్రమాదానికి కారణమైన లారీ

పెద్దదోర్నాల: కూలీలతో వెళ్తూ రోడ్డు పక్కన ఆగిన ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఆరుగురికి తీవ్ర, మరో 12 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన శ్రీశైలం ఘాట్ రోడ్డులోని బోడేనాయక్ తండా సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో చింతల గిరిజన గూడేనికి చెందిన భూమని వెంకటేశం, జల్లా నాగలక్ష్మీ, కుడుముల సాయిరాం, కుడుముల మల్లిక, భూమని నాగమ్మ, భూమని అంకమ్మలకు తీవ్ర గాయాలకు కాగా, మరో 12 మంది స్వల్పంగా గాయపడ్డారు. అందిన సమాచారం మేరకు.. చింతల నుంచి పెద్దబొమ్మలాపురం గ్రామానికి మిర్చి కోతకు కూలీలు బయలుదేరారు. ఈ క్రమంలో బోడేనాయక్ తండా సబ్‌స్టేషన్ వద్ద డ్రైవర్ ఆటోను ఆపి ఎదురుగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారునితో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో శ్రీశైలం నుంచి వెనుకగా వస్తున్న లారీ ఆటోను ఢీ కొట్టింది. ప్రమాద సమయంలో పెద్దదోర్నాలకు చెందిన 108 వాహనం పురిటి నొప్పులతో బాధపడ్తున్న ఓ మహిళ కోసం ఇతర ప్రాంతానికి వెళ్లి ఉంది. దీంతో మార్కాపురం, పెద్దారవీడు 108 వాహనాల సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం వారిలో కొందరికి గాయాల తీవ్రత అధికంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట తదితర ప్రాంతాలకు తరలించారు.

మిన్నంటిన క్షతగాత్రుల రోదనలు

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుల రోదనలతో దోర్నాల వైద్యశాల హోరెత్తింది. క్షతగాత్రులకు ఆర్థోపెడిక్ వైద్యుడు సంజీవ్ ప్రథమ చికిత్స చేశారు. ప్రమాద సమాచారం అందుకున్న పెద్దదోర్నాల పోలీసులు హుటా హుటిన సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. వైద్యశాలకు చేరుకుని క్షతగాత్రుల పరిస్థితి తెలుసుకున్నారు. తీవ్ర గాయాలపాలైన క్షతగాత్రులను మెరుగైన వైద్యం నిమిత్తం ఇతర ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లను పర్యవేక్షించారు.